# హింస

మా కుటుంబాలలో పిల్లల్ని పెంచటానికి రెండే పద్ధతులు, పిల్లల్ని చావగొట్టి చెవులుమూసి చెప్పినమాట వినేటట్టు చేయటమూ, లేకపోతే వాళ్ళని గారాబం చేసి వాళ్ళు ఆడినట్టు ఆడటమూ ఒకటి సన్మార్గమూ, రెండోది దుర్మార్గమూను. కొందరికి రెండూ దుర్మార్గాలే అనిపించవచ్చు. అది వేరే విషయం. మరో పద్ధతిలో పిల్లల్ని పెంచటం సాధ్యమని మేం మటుకు ఒప్పుకోం. ఎక్కడైనా, ఎవరైనా పరాయివాళ్ళ పిల్లలు మా పిల్లలల్లే కాకుండా తల్లిదండ్రుల ప్రేమకు పాత్రులవుతూ కూడా, తల్లిదండ్రులు చెప్పే మాటలను విశ్వసిస్తూ వాళ్ళు వద్దన్న పనులు మానటం మా అనుభవంలోకి వస్తే అది ఆ తల్లిదండ్రుల పూర్వకృత పుణ్యమంటారు! "పుణ్యం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ పిల్లలు" అనుకుంటాం. మాకటువంటి పిల్లలు పుట్టక మాకు పుట్టేవాళ్ళు చూస్తూ చూస్తూ మా మాట వినరు. మేం పూర్వజన్మలో చేసిన పాపం అటువంటిది! అంచేత మేం వాళ్ళని క్రమశిక్షణలో పెంచుతాం. వాళ్ళ బాగు

కోసమే వాళ్ళని కొడతాం. మేం కొట్టకుండానే వాళ్ళు భయభక్తులు కలిగివుంటే ఇక కావలసిందేమిటి? కాని అంత అదృష్టం మాకు రాసిపెట్టివుంటేగా? పిల్లల్ని క్రమశిక్షణలో ఉంచలేకపోతే వాళ్ళని పాడుచేస్తాం. ఆపేక్ష అని పేరుపెట్టి వాళ్ళను పడేసి నాకుతాం. అది మా దౌర్బల్యం. అందు కనే అట్లా పెరిగిన పిల్లలు మాట వినరు. మాకు ఎదురు తిరుగుతారు. చిన్నతనంలో పిల్లల్ని హద్దులో ఉంచలేక పోయినందుకు వాళ్లు పెద్దయినాక తలవంచుకు తిరగవలసి వస్తుంది. మొక్కై వంగనిది మానై వంగుతుందా ఏమిటి?

*　　*　　*　　*

క్రిష్టుడు చిన్నప్పటినుంచీ చాలా భయభక్తులతో పెరిగినవాడు. ఎందుకు పెరగడూ? మహాలక్ష్మమ్మగారు ఆరుగురు పిల్లల్ని కన్నది ఆరుగురూ ఆరుగురే నవరత్నాలు. ఎన్నడూ తలిదండ్రులమాట జవదాటి ఎరుగరు. పెద్ద మొగ పిల్లలిద్దరూ పెళ్ళయిన తరవాత అత్తవారి వలలోపడి తల్లి దండ్రులకు దూరమైనారుగాని పెళ్ళయ్యేవరకూ ఎంత భయభక్తులతో పెరిగారు! తరవాత ఆడపిల్లలిద్దరూ మొగుళ్ళ దగ్గిర భయభక్తులతో కాపరాలు చేస్తున్నారు. కిష్టుడూ కడగొట్టు పిల్లడే ఉన్నాడు. అందరు పిల్లల్ని అదుపులోనే పెంచిన మహాలక్ష్మమ్మ, పెద్దపిల్లలు అట్లా దూర మైనాక కిష్టుణ్ణి ఇంకా శ్రద్ధగా పెంచింది. వాణ్ణి ఎవరి సావా సమూ చెయ్యనిచ్చేదికాదు. వెయ్యికళ్ళతో కనిపెట్టివుండేది.

అన్నం తూచినట్లు పెట్టేది. ఆకలి అయినా కాకపోయినా గడియారం ప్రకారం పెట్టేది. వాడు తిండి సరిగా తినకపోతే మొట్టి తినిపించేది. ఇంకా కావాలంటే నాలికపీక్కు చచ్చినా పెట్టేదికాదు. ఆవిడ అంత శ్రద్ధగా పెంచినా కిష్టుడు రోగిష్టిగానే వుండేవాడు. వాడికి నరాలజబ్బు వుందని డాక్టర్లు చెప్పారు డబ్బు గుంజటానికి ఈ డాక్టర్లు ఏమైనా చెబుతారు అందుకనే వాడికి పదిరోజులకోసారి జబ్బుచేస్తే నాటు వైద్యుణ్ణి పిలిపించేది మాలక్ష్మమ్మ ఇక ఆ నరసింహంగారి మాట చెప్పనే అక్కర్లేదు. ఆయన హుంకరిస్తే కిష్టుడు లాగులో ఉచ్చపోసుకునేవాడు. తండ్రి నడవలోకివస్తే వాడు దొడ్లో వుండేవాడన్నమాట.

♦ ♦ ♦ ♦

మాలక్ష్మమ్మ పిల్లల్ని పెంచటం విషయంలోనే కాక అన్ని విషయాలలోనూ అద్భుతమైన నియమాలుకలది. ఆవిడ ఏజంతువునూ హింసించేదికాదు. వాళ్ళింట్లోకి తేళ్లు వస్తే వాటిని వుపాయంగా పట్టుకుని, దారంకట్టి కర్రతో కొండకు తీసికెళ్ళి, కర్ర తోమి కడిగి వేళ్ళను వదిలిపెట్టేది. మరోసారి వాళ్ళయింటినిండా నల్లులు పుట్టలు పుట్టలుగా బయలుదేరినై. ఆవిడ నల్లినికూడా ఎన్నడూ చంపేదికాదు. నల్లులు పోవటానికి ఎవరో మంచి వుపాయం చెప్పారు. ఆవిడ ఒక పెద్ద కాగితం సంపాదించి కిష్టుడిచేత దానిమీద, చివర "టు" అనే అక్షరం వచ్చే ఊళ్ళపేర్లన్నీ — రాయించి,

గూడూరు, నెల్లూరు మొదలైనవి రాయించి, ఆ కాగితం చుట్టగా చుట్టి ఇంటి కప్పుకు వేళ్ళాడగట్టింది. ఆ నాటినుంచీ ఆవిడను నల్లి కుట్టి ఎరగదు, రాత్రి పడుకుంటే భళ్లున తెల్లవారేదాకా మెలుకువ వచ్చేదికాదు.

“నీ మొహంమల్లేనే వుంది! తెల్లవార్లూ నన్ను నల్లులు చీకపీకినై.” అన్నాడు నరశింహంగారు.

“మీ భ్రమ, ఇంకా నల్లి ఎక్కడ కుడుతుంది?” అన్నది మాలక్ష్మమ్మ.

“నాపక్కనిండా పాకితేనే?”

“పాకుతై, కుట్టవు,” అన్నది మాలక్ష్మమ్మ.

అటువంటి మాలక్ష్మమ్మ పెంపకంలో పెరిగాడేమో కిష్టుడు కించిత్తయినా జీవహింస సహించేవాడు కాదు. వాడు కాకుల్ని, పిచ్చికల్ని, పిల్లుల్ని, కుక్కల్ని వీలయినప్పుడల్లా మేపేవాడు.

ఈవిషయమై వాణ్ణి తల్లి కోప్పడవలసికూడా వచ్చింది.

“కాకి ఆకలై అరుస్తే కొంచెం చద్దన్నం పెట్టానమ్మా,” అన్నాడు కిష్టుడు భయంతో పిచ్చి మొహంవేసి.

“కాకి ఆకలి వెయ్యకపోయినా అరుస్తుంది. కాకుల్ని పక్షుల్ని చూసి జాలిపడాలి గాని అన్నంవేస్తూ కూచుంటారుట్రా?” అన్నది తల్లి.

ఈ గుణపాఠాన్ని అర్థం చేసుకోవటానికి కిష్టుడు ప్రయత్నించాడు.

వాడికి అన్ని జంతువులమీదా జాలివుందిగాని బల్లుల మీాద మటుకు లేదు. వాడు రోజూ గోడమీాద బల్లులు పురుగుల్ని వేటాడటంచూసేవాడు. ఒకరోజువాడుచూస్తుండగా బల్లి ఒకటి పొతంత రెక్కల పురుగును పట్టుకుంది. కిష్టుడది చూడలేక కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. కాస్సేపటికి వాడు కళ్ళు తెరచిచూస్తే బల్లివుంది గాని రెక్కలపురుగు దానినోట్లో లేదు. కిష్టుడి హృదయం ఆనందంతో పొంగి పోయింది. రెక్కలపురుగు బల్లినోట్లోపడి తప్పించుకు పోయిందనుకున్నాడు.

మరోసారి కిష్టుడు చూస్తుండగానే పిల్లి ఒకటి ఎలకని పట్టుకుంది. ఆ సమయంలో కిష్టుడు అన్నం తింటున్నాడు. పిల్లి లోపలికి వచ్చింది. దాని వాలకం చూస్తే ఏదో పెద్ద పనిమీాద ఉన్నట్టు కనపడ్డది. మాలక్ష్మమ్మ "ఛీ! ఛీ!" అంది. అది వినిపించుకోలేదు. మూలఉన్న బుట్టను పంజాతో గీర సాగింది. కాస్సేపటికి అది అమాంతం దేనిమీాదనో పడి దాన్ని నోట కరుచుకుని బయటికి వెళ్ళిపోయింది. కిష్టుడి కళ్ళకేదో మైకం కమ్మినట్టయి, పిల్లినోట ఉన్న ఎలిక వాడికి కనిపించలేదు.

"ఎంత ఎలికో!" అన్నది తల్లి.

కిష్టుడిక అన్నం సహించలేదు. తల్లి మొట్టికాయలతో వాడి చేత అన్నం తినిపించింది.

ఆరోజునుంచీ వాడికి పిల్లులమీద జాలి పోయింది.

*    *    *    *

కామయ్యగారి ఇంట్లో ఒక కుక్క ఉండేది. దానికెప్పుడన్నా వాళ్లు అన్నం పెట్టేవాళ్ళు. కిట్టుడికి ఈ కుక్క అంటే ప్రాణం. "కస్తూరీ" అని పిలిస్తే అది తోకాడించుకుంటూ వాడి దగ్గరకి వచ్చేది. దాన్ని ముట్టుకుంటే ఒకప్పుడు చూసినంతమాత్రంచేతనే, కిట్టుడి హృదయంలో ఏదో బిగబట్టి నట్టయేది. దాన్ని గట్టిగా గుండెకు అదుముకుని ఎప్పటికీ వదలకుండా ఉండాలనిపించేది. కుక్కల్ని మనుషులు ముద్దుపెట్టుకోరని కిట్టుడికి తెలుసు కాబట్టి సరిపోయింది కాని లేకపోతే, వాడు దాన్ని, ఎవరూ చూడకుండా ముద్దులు కూడా పెట్టుకునేవాడేమో.

కస్తూరికి కిట్టుడు తన చేతిమీదుగా ఎన్నడూ ఏమీ పెట్టలేదు. కాని అది ముఖ్యంకాదు. దానిమీద వాడికి చాలా జాలి. పాపం, దానికి కడుపులో నొప్పివస్తే ఎవరితోనూ చెప్పలేదుకద! ఆకలయితే అన్నం పెట్టమని అడగటానికి దానికి అమ్మలేదు కద! ఇటువంటి ఆలోచనలు రాగానే కిట్టుడికి పొర్లి పొర్లి ఏడుపు వచ్చేది.

ఒకసారి కస్తూరి నాలుగు పిల్లల్ని పెట్టింది. కిట్టుడికి ఒకరోజల్లా మనస్సు చిక్కబట్టుకొని చివరకు వాళ్లమ్మ నడిగాడు. "అమ్మా! కామయ్యగారు కస్తూరి పిల్లల్ని అందరికీ

ఇచ్చేస్తున్నారు. మనం కూడా ఒకటి తెచ్చుకుందామా ?” అని.

“ఇంకా నయం ! మీ నాన్న వింటే తాట వొలిచేస్తారు” అన్నది మాలక్ష్మమ్మ. కిస్టుడిక ఆ విషయం ఎత్తలేదు.

*       *       *       *

ఒకనాడు కిస్టుడు బడినుంచి ఇంటికి వచ్చాడు. బయట్నుంచున్నాడు. కస్తూరి కనిపించలేదు. ఆరోజే వాడు సాహసించి కస్తూరికోసం ఒక పప్పుండ తెచ్చాడు. ఆరోజు ప్రొద్దున వాడు బళ్ళోకి వెళ్ళేటప్పుడు వాడొక పప్పుండ కొనుక్కొని, కొంచెం కొరికాడు. ఇంతలో కస్తూరి జ్ఞాపకం వచ్చి కొరికిన పప్పుండ జేబులోదాచి ఇంటికి వచ్చాడు. అందుకోసం నిలబడటం జరిగింది.

చాలాసేపు చూసి విసుగెత్తి కిస్టుడు కామయ్యగారింటోకి వెళ్ళాడు. వరండాలో కస్తూరి కన్నపిల్ల ఒకటి దీనంగా కుంయి కుంయి మంటున్నది. కామయ్యగారు పళ్ళెంలో పాలు పోసి దానిచేత తాగించటానికి ప్రయత్నిస్తున్నాడు.

“కామయ్య బాబుగారూ ! కస్తూరి ఏదీ ?”అన్నాడు కిస్టుడు, పరాయివాళ్లతో మాట్లాడటం అలవాటు లేని జంకుతో.

"పట్టుకెళ్ళారుగా యములవాళ్లూ!" అన్నాడాయన. కిష్టుడి కర్థంకాలేదు.

"దేనికీ?" అన్నాడు కిష్టుడు.

"ఇంకా దేనికి? చంపటానికి! ...... ఈ పిల్ల ఇంకేం బతికిచస్తుంది. పాలు పోస్తే తాగిన పిల్లలన్నిటినీ ఇచ్చేశాను. ఈ వెధవకు పాలు త్రాగటం చేతకావటంలేదు. ఆ మునిసిపాలిటీవాళ్లు దీని తల్లిని కాస్తా పొట్టన పెట్టుకున్నారు" అన్నాడు కామయ్య.

"కస్తూరి చచ్చిపోయిందా?"

"చంపితే చావదూ?"

"ఎవరు చంపారు?"

"మునిసిపాలిటీవాళ్ళు."

"ఏం చేసేదీ?

"ఏం చెయ్యకపోయినా చంపుతారు. లేకపోతే కుక్కలు పిచ్చెరేగి బతకనిస్తాయా? అందుకని చంపేస్తారు."

"మంచి కుక్కల్నికూడా చంపేపేస్తారా?"

"కుక్కలికి మంచేమిటి? చెడేమిటి?"

*　*　*　*

క్రిష్టుడికి ఏమయిందో తెలీదు. ఆరోజునుంచీ వాడు మారాడు. ఏది కనిపిస్తే దాన్నల్లా చంపేస్తాడు. గోడమీది

పిల్లుల్నీ, మిడతల్నీ, నేలమీది చీమల్నీ, చెట్లమీది తొండల్నీ నీళ్ళ దగ్గర కప్పల్నీ బతకనివ్వడు. వాడు చూస్తుండగా వాళమ్మ తేళ్లను పట్టుకుంటే చంపేస్తాడు. నల్లుల్ని వేటాడ తాడు.

ఇది చూసి వాళ్లమ్మ విసుపోతుంటే, వాడిప్పుడు వాళమ్మ మాటా, తండ్రి మాటా కూడా లక్ష్యం చేయడు. ఒకసారి వాళ్ల నాన్న కొట్టవచ్చేప్పటికి వాడు చేతిలో వున్న పలక తండ్రి మొహాన కొట్టాడు. ఆయన మొహం అంత మేర కోసుకుపోయింది.

ఈ మార్పు వచ్చిన తరువాత కూడా కొంతకాలం వాడు కస్తూరిని తలుచుకుని చాటుగా ఏడిచేవాడు. కాని ఇప్పుడు వాడికి కస్తూరి జ్ఞాపకం రాదు. వస్తే విచారం కూడా లేదు. వాడి అంతరాత్మకు కావలసింది అదే గామాలు !